

- అప్పుల ఊబిలో పంచాయతీలు
- గ్రామాల్లో నిలిచిన అభివృద్ధి పనులు
- నిధుల లేమితో పరిష్కారం కాని సమస్యలు
- అప్పులు తెచ్చి నెట్టుకొస్తున్న కార్యదర్శులు
- పాలకవర్గం లేకపోవడంతో నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు



బకాయిల భారం

బెజ్జూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు ఆర్థిక భారంతో సతమతమవుతు న్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా నేప థ్యంలో పాలకవర్గాలు ఏర్పాటు కాకపోవడం పల్లె_పాలనపై ప్రభావం చూపుతోంది. మరి ముఖ్యంగా రోజువారీ పారిశుధ్య నిర్వహణ గగనంగా మారిందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బందికి సైతం నెలానెలా ఇవ్వాల్సిన వేతనాలు అందడం లేదు. నాలుగైదు నెలలకు ఒక సారి ఇస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీ లకు రావాల్సిన ఆదాయం కూడా క్రమంగా తగ్గిపోవడంతో స్థానిక నిర్వహణ గగనంగా మారింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పాలకవర్గాలు లేని కారణంగా గత రెండేళ్ల సకాలంలో రావడం లేదని పంచాయతీ కార్యదర్శులంటున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా, ఇవి రెం డే ళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి.

పాలన అస్తవ్యస్తం..

పత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి మాట అటుంచితే సమస్యలే పరిష్కారం కావడం లేదు. గ్రామాల్లో పారిశుధ్యం అస్త వ్యస్తంగా తయారైంది. సర్పంచుల పదవీ కాలం 2023 ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేకా. దికారుల పాలన కొనసాగుతోంది. దీంతో అభివృద్ధి ప నులు, సమస్యల పరిష్కారం బాధ్యత పంచా యతీ కార్యదర్శులపై పడింది. ఏడాదిన్నర కాలంగా పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి పరిపాలన సాగిస్తున్నారు. గ్రామాల్లో వసూలు చేసిన పన్నుల నుంచి కొంత డబ్బు ఖర్చు చేసినా గ్రామాల్లో కుంటుపడ్డ అభివృద్ధి పనులకు అవి ఏ మాత్రం చాలడం లేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇక రోజువారీ డీజిల్‌కు డబ్బులు సర్దడం తలకు మించిన భారంగా మారుతోందని కార్యదర్శులు వాపోతున్నారు. కొన్ని పంచాయతీల్లో వేరేవారి వద్ద అప్పుతీసుకొని ఖర్చు చేస్తున్నామని ఓ కార్యదర్శి తెలిపారు. పాలకవర్గాలకు నియమించిన ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీల నిర్వహణను పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. వారు గ్రామాల్లో ఏనాడు తిరిగిన పాపాన పోలేదని తెలుస్తోంది. ఇలా పంచాయతీ పరిధిలో ప్రతి పనికి నగదు లేనిదే పని కావడం లేదని కార్యదర్శులు చెబుతున్నారు. దీంతో తమకు తలకు మించిన భారంగా మారుతుందని ఆవేదన చెందుతున్నారు.

ఎస్ఎఫ్‌సీ నుంచి..

రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) నుంచి మాత్రం పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేస్తుంది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలను నెలనెలా ఇవ్వకున్నా కొంత మేర ప్రతీ రెండు, మూడు నెలలకో సారి విడుదల చేస్తోంది. అది కూడా పంచాయతీ కార్మికులు తమకు నెల నెలా వేతనాలు అందజే యాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరు తూ ధర్నాలు చేస్తే నిధులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్రం విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పాలకవర్గం లేని కారణంగా అందడం లేదు. పాలక వర్గం బాధ్యతల చేపట్టితే తప్ప ఆ నిధులు వచ్చే పరిస్థితి లేదు. అటు కేంద్ర నిధు లు రాక, ఇటు రాష్ట్రం నిధులు విడుదల చేయక గ్రామ పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు తలకు మించిన భారమవుతోంది.

డీజిల్‌కు డబ్బులేవి..

గ్రామపంచాయతీలకు గత ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేసి వాటిని వాయిదాల పద్ధతిలో లేదా పంచాయతీ నిధులతో ఒకేమారు కొనుగోలు చే యాలని సూచించింది. ఈ క్రమంలో కొన్ని పంచా యతీలు ట్రాక్టర్లు వాయిదాలపై కొనుగోలు చేయగా మరికొన్ని పంచాయతీలు మొత్తం చెల్లించి కొనుగో లు చేశాయి. వాయిదా పద్ధతిలో తీసుకున్న ట్రాక్టర్లకు సంబంధించి ఈఎంఐ చెల్లింపులు నిలిచిపోవడంతో ఫైనాన్స్ కంపెనీలు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంటామని బెదిరిస్తున్నాయని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. పెద్ద పంచాయతీల్లో ప్రతి నెలా ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చు రూ.20వేలు అవుతోంది. చిన్న పంచాయతీల్లో రూ.10వేల వరకు ఉం టోంది. ప్రతి నెలా ట్రాక్టర్ల నిర్వహణకు లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. దీంతో పంచాయతీల నిర్వహణ భారమవుతోందని కార్యదర్శులు చెబుతున్నారు.

ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం అందించడం, వారి హక్కులపై అవగాహన కల్పించడమే న్యాయ సేవా దినోత్సవం ధ్యేయమని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని స్పెషల్ సబ్ జైలులో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా దినోత్సవం కార్యక్రమాన్ని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏటా నవంబరు 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ చట్టం 1987లో రూపొందించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఏటా నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఏడీసీఎస్ కార్యదర్శి యువరాజ, జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, నరహరి, వెంకటేశ్వర్లు, అంజనిదేవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సిర్పూర్(టి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమ త్తంగా ఉండాలని ఏఎస్సై రాములు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులకు జాగ్రత్తలు తెలపాలని ఎస్సై మధుకర్ అన్నారు. గురువారం మండలంలోని హట్టి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైబర నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సిర్పూర్(టి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండల ఈసుగాం గ్రామ పంచాయతీ రాంనగర్‌కు చెందిన సూరజ్ ఘరామి(33) మద్యం మత్తులో సిర్పూర్(టి) మండలం చిచ్చుపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం సూరజ్ ఘరామి ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి కనబడకుండా పోయాడు. కుటుంబీకులు వెతుకుతుండగా గురువారం చెరువులో మృతదేహం కనిపించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి కొనుగోళ్లలో కొర్రీలు.. రైతుల ఆందోళన



వాంకిడిలో ఆందోళన చేస్తున్న రైతులు

వాంకిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రంలో తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయకుండా అధికారులు కొర్రీలు పెడుతున్నారని నిరసిస్తూ గురువారం వాంకిడిలోని జీవీపీ ఆగ్రో జిన్నింగ్ మిల్లు ఎదుట జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేశారు. జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా కొనుగోళ్లు బుధవారం ప్రారంభం కావడంతో 56 మంది రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు రైతులు వాహనాల్లో పత్తిని నింపుకుని మిల్లుకు తీసుకు వచ్చారు. కేవలం పది పత్తి వాహనాలకు తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, 12 శాతం మించితే పత్తి కొనుగోలు చేయలేమని సీపీవో (పత్తి కొనుగోలు అధికారి) తేల్చి చెప్పారు. సీసీఐ ద్వారా పత్తి విక్రయించేందుకు ఎంతో ఆశతో వస్తే తేమపేరుతో కొనుగోలు చేయకుండా వెనక్కి పంపించడం ఎంతవరకు సమంజసమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిన్నింగ్ మిల్లు ముందు జాతీయ రహదారిపై ఆందో ళనకు దిగారు. సుమారు మూడు గంటల పాటు రహదారిపై బైఠాయించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి పంట దెబ్బతిని పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేని సమయంలో సీసీఐ అధికారులు నిబంధనలు విధించడం సరైంది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్లాట్ బుక్ చేసి సీసీఐ కేంద్రానికి తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని చెప్పారు. ఎస్సై మహేందర్, తహసీల్దార్ కవిత, వ్యవసాయ అధికారి గోపికాంత్ రైతులతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తామని చెప్పినా రైతులు వినిపించుకోలేదు. అనంతరం సీపీవో కిరణ్‌దేశ్‌ముఖ్‌ను పిలిపించి సీసీఐ ఉన్నతాధికారు లతో రైతులను మాట్లాడించారు. తేమ శాతం నిబంధన కేం ద్ర ప్రభుత్వ సూచన మేరకు ఉంటుందని, ఉన్నతాధి కారులతో చర్చించి సమస్యను పరిష్కరించేలా చూస్తామని సీసీఐ అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విర మించారు. కార్యక్రమంలో వాంకిడి మాజీ సర్పంచు బండె తుకారం, ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జెరాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపక్‌ముండే, సీపీఎం రెడ్‌స్టార్ పార్టీ జిల్లా నాయకుడు గోగర్ల తిరుపతి, రైతులు పాల్గొ న్నారు. జీవీపీ ఆగ్రో జిన్నింగ్ మిల్లు ఎదుట జాతీయ రహదారిపై రైతులు చేపట్టిన రాస్తారోకో కార్యక్రమంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి పంటను సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామ శివారులోని ఆర్ఎస్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులతో కలిసి గురువారం జిల్లాలోని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతుల వద్ద నుంచి మద్దతు ధర చెల్లించి పంట కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులు తాము పండించిన పత్తి పంటను దళారులకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్ట పోకూడదని తెలిపారు. ప్రతి రైతు కపాస్ కిసాన యాప్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. తమ వివరాలు నమోదు చేసుకోవాలని, ఆదిశగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 3.30 లక్షల ఎకరాల పత్తి పంట సాగు చేశారని, సుమారు 38 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో సీసీఐ ఆధ్వ ర్యంలో 24 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.8,110 మద్దతు ధర అందిస్తుందని, జిన్నింగ్ మిల్లు నిర్వాహకుల పత్తి తీసుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం చెల్లిస్తున్న మద్దతు ధర, తేమ శాతం అంశాలపై ప్రజలందరికి తెలిసే విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ ఆదేశిం చారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవ సాయాధికారి మిలింద్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరో భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి జిల్లా పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, రవాణా, తూనికలు, కొలతలు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో వానాకాలం 20225-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్ల, ఏర్పాట్ల నిర్వాహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా చేట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో అంచనా 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, రైతులు ధాన్యాన్ని పూర్తిగా అరబెట్టిన తరువాతే నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, తూకం యంత్రాలు, ట్యాబ్‌లు, టార్పాలీన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు చేసి ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, గ్రామీణాభివృద్ధి అదికారి దత్తారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంతలక్షిమ, జిల్లా మార్కెటింగ్ అధికరి అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

నష్ట పరిహారం చెల్లించాలి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేటలోని ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు నారాయణ, పోశన్న, తిరుపతి, జక్కయ్య, సదాశివ్, వెంకన్న, మధుకర్, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

కెరమెరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని పరందోళి, ముక్దంగూడ గ్రామ పంచాయతీల్లోని గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ కోరారు. స్థానికంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శశాంక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

రెబ్బెన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్‌లో గురువారం దాసరి రమణారెడ్డి జయతిని పురిస్కరించుకుని సీపీఐ నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, నర్సయ్య, జగ్గయ్య, ఉపేందర్, రాజేష్, కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆసిఫాబాద్ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థినులు అమూల్య, ముత్తుబాయి, అనిత, పల్లవి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జంగు, పీడీ మీనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను డీడీ రమాదేవి, గిరిజన క్రీడల అధికారి షేకు, ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో అశోక్, ఇన్‌చార్జి హెచ్ఎం లింబరావు గురువారం అభినందించారు.

పశువులకు టీకా వేయించాలి

జైనూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయిచాలని పశు వైద్యాధికారి మురళికృష్ణ రైతులను కోరారు. పొలాసలో గురువారం పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సికిందర్, సిబ్బంది సూర్యకాంత్, మంగిలాల్, ప్రకాష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉదోయగులకు రావాల్సిన రెండు నెలల వేతనాలు, ఏరియర్స్, పీఆర్ తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆఫీసు సూపరింటెండెంట్ సఫియోద్దీన్‌కు గురువారంవినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వేతనాలు రాక పోవడంతో కార్మికులు పస్తులుండాల్సి వస్తుందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, చిరంజీవి, నగేష్, రాందాస్, శ్రీదేవి, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవానీ, సమత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీసీపీవో మహేష్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీసీపీవో మహేష్ అన్నారు. పర్శనంబాలలో గురువారం ప్రత్యేక చైల్డ్ మ్యారేజ్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశం, అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు వివరించారు. బాల్య వివాహం చిన్నారుల భవిష్యత్‌ను దెబ్బతీసే తీవ్రమైన సామాజిక సమస్య అని దీని వల్ల బాలికల్లో ఆరోగ్య సమ స్యలు, విద్య మధ్యలో ఆగిపోవడం, మానసిక ఒత్తిడులు తదితర సమస్యలు ఎదురవుతా యన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ వెంకటే ష్, ఎంపీవో మౌనిక, హెడ్‌మాస్టర్ వసంతరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లైలా, జెండర్ స్పెషలిస్టు రాణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, ఎన్జీవో ప్రతినిధి దేవాజీ, కేస్ వర్కర్ సుకన్య, ఉపాధ్యాయులు విఠల్, మల్లేష్, ఆత్మారావు తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా పాఠశాలల్లో యూడైస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సయ్యద్ అబిద్ అలీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం యుడైస్ ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లానింగ్ కో ఆర్డిటర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి డేటా సేకరణ, ధ్రువీకరణ, సమయానికి ఆన్‌లైన్ ఎంట్రి చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. సూచనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పొరపాట్లు జరుగకుండా చూసుకోవలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, ఎఫ్ఏఓ దేవాజీ, ఏపీవో మల్లేష్, టీపీ రాము, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీ, ఎస్‌సీఆర్పీలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జైనూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్రన్ జిన్నింగ్ మిల్లులో గురువారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, మండల సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జైవంత్‌రావ్ మాట్లాడుతు ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం మునుపెన్నడు లేనవి విధంగా 8,130 రుపాయలు పత్తికి గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. సీసీఐలో పత్తి అమ్మకం చేస్తున్న రైతులు 10 శాతం లోపు తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు చైర్మన్లతో పాటు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఏవో ఆనంద్‌రావ్, సీపీవో నరేష్, పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ముకీద్, డైరక్టర్లు పంద్ర షేకు, రాధాబాయి, మేస్రాం దేవరావ్, మడావి క్రిష్ణ, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, ఎఈవో వినోద పాల్గొన్నారు.



నియమాల దీక్ష.. ఆరోగ్య రక్ష..

ఆధ్యాత్మికత పెంచుతున్న అయ్యప్ప మాల

సామూహిక పూజలతో సమైక్యతాభావం

బెజ్జూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదలు మకర సంక్రాంతి వరకు ఎటు చూసినా అయ్యప్ప దీక్షలు, స్వామియే శరణం అయ్యప్ప..నామస్మ రణలు వినిపిస్తుంటాయి. దీక్షాదారులు ఒక క్రమ పద్ధతిలో మండలం(41రోజులు) జీవనయానం సాగిస్తుండడంతో పుణ్యం, ముక్తిదాయకమైన భావనే కాకుండా ఆరోగ్యం, మానసిక ఔన్నత్యానికి తోడ్పడే ఇహభావన కూడా లభిస్తుంది. అయ్యప్ప భక్తులు దీక్షకాలంలో నల్లటి వస్త్రాలు ధరిస్తారు. ఈ దుస్తులు ధరించిన వారిపై శని దేవుడి చూపు ఉండదని భక్తుల విశ్వాసం. శాస్త్రీయంగా చూస్తే చలికాలంలో నల్లని దుస్తులు శరీరానికి వేడినిస్తాయి. మెడలో రుద్రాక్షమాల ధరించడంతో రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు అదుపులో ఉంచుతాయి. తులసిమాల నుంచి వచ్చే సుగంధం రోగనిరోధకశక్తిని పెంచుతుంది. స్పటిక, తామర, పగడాల మాలలతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

ఇక పల్లెలు, పట్టణాల్లో అయ్యప్ప దీక్షాదారుల సందడి మొదలైంది. పల్లె, పట్టణం అని తేడా లేకుండా అయ్యప్ప నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఎక్కడ చూసినా ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. అయ్యప్ప మాలధారులు కఠినమైన నిబంధనలు పాటిస్తూ స్వామి వారి సేవలో నిమగ్నమవుతున్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఒంటిపూట భోజనం, అనుక్షణం అయ్యప్ప నామస్మర ణ చేస్తూ తరిస్తున్నారు. ఏటా కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను స్వీకరించి 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్ష ను పాటిస్తారు. ఏదైనా ఒక పనిని 41 రోజుల పాటు చేస్తే అది జీవితంలో భాగం అయిపోతుందంటారు. అందుకే అయ్యప్ప దీక్షను 41రోజులు పాటిస్తారని భక్తులు విశ్వసిస్తారు. కఠిన దీక్షతో, క్రమశిక్షణ, ఆహార, వ్యవ హారాల్లో మార్పు వస్తుందని మాలధారులు చెబుతారు. మాలధారణ చేపట్టిన అయ్యప్ప స్వాములు వేకువ జామున నాలుగు గంటలకే మేల్కొని చన్నీటితో స్నానాలు ఆచరించి స్వామికి భక్తి శ్రద్ధలతో నిత్యం పూజలు చేస్తారు. మాలధారణ చేపట్టిన స్వాములు అత్యంత కఠినమైన నియమాలు పాటిస్తూ ఉంటారు. రాత్రి వేళ అల్పాహారం లేదా పండ్లు తిని నిద్రకు ఉపక్రమిస్తారు. రాత్రి సమయంలో భజన పాటలతో నిత్యం స్వామికి పూజలు చేస్తారు.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం..

దీక్ష ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. భక్తిభావం తో పాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది ఈ దీక్షను తీసుకుంటారు. ఉదయన్నే నిద్ర లేవడం చైతన్యానికి ప్రతీకగా , సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థ ఉత్తేజపరుచడం, నేల మీత పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోయే అవకాశం ఉందని చెబుతారు. కండరాల పటిష్టత, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. నిత్యదీపారాధనతో మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురాలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుంది. దీక్ష చేపట్టిన స్వాములు శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు.

ఇందులో ముఖ్యంగా కన్నె స్వాములు తప్పకుండా యాత్ర చేయాల్సి ఉంటుంది. ఇందులో బాగంగా పెద్ద పాదం చేపట్టే వారు కేరళలోని ఎరిమేలి వరకు వాహనాల్లో చేరుకొని అక్కడి నుంచి నడుచుకుంటూ అటవీ మార్గంలో 45కిలో మీటర్లు ప్రయాణించి ఆలయానికి వెళ్తారు. మార్గం మధ్యలో కాలికట్ట ఆశ్రమానికి చేరుకుంటారు. అళుదానదిని దాటి కలిడం కొండ, కరిమల కొండ పెరియాన వట్టం, సిరియాన వట్టం గుట్టలపై నుంచి పంబానది మీదుగా వెళ్తారు. పంబా నుంచి చిన్న పాదం మొదలవుతుంది. పెద్దపాదం చేయని అయ్యప్ప స్వాములు బస్సుల ద్వారా పంబాకు నేరుగా చేరుకొని అక్కడి నుంచి నడిచి వెళ్తారు. వృద్ధులకు, నడవలేని వారికోసం అక్కడ డోలి(మోసుకొని వెళ్లేది) సదుపాయం ఉంటుంది. దానికోసం అక్కడ వారు కొంత డబ్బులు తీసుకుంటారు. పంబాలో పవిత్ర స్నానం ఆచరించి ఇరుముడితో కన్నెస్వాములు గణపతికి కొబ్బరికాయ కొట్టి చిన్నపాదం ప్రారంభిస్తారు. అప్పాచి మేడే, నీలిమల కొండ, శరణుగుత్తి కొండపై నుంచి సన్నిధానం వరకు చేరు కుంటారు. అనంతరం 18మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకొని ఇరుముడిని సమర్పిస్తారు. ఇరుముడి ఎత్తుకున్న స్వాములకు మాత్రమే 18మెట్లు ఎక్కేందుకు అక్కడి అధికారులు అనుమతిస్తారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధుడి సజీవ దహనం



రాజయ్య(ఫైల్)

దండేపల్లి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్య(66) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బుధవారం రాత్రి సజీవ దహనమయ్యాడు. ఎస్సై తాహసీనోద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజయ్య కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు అతడికి బీడీలు తాగే అలవాటు ఉంది. బుధవారం రాత్రి గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడ మద్యం తాగి భోజనం చేసి ఇంటికి వచ్చి నిద్రించాడు. మద్యం మత్తులో ఉన్న రాజయ్య అర్ధరాత్రి లేచి బీడీ వెలగించుకుని తాగాడు. బీడీ ఆర్పకుండా అక్కడే పడవేయడంతో అతడి బట్టకు బీడీ మంట అంటుకుంది. మద్యం మత్తులో ఉండటంతో లేవలేకపోయాడు. సమీపంలో నిద్రిస్తున్న కుటుంబసభ్యులు గమనించి కేకలు వేశారు. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే మంచానికి అతని బట్టలకు మంటలు అంటుకుని రాజయ్య సజీవ దహనమయ్యాడు. రాజయ్య భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బైక్‌పై తరలిస్తున్న కలప పట్టివేత

దండేపల్లి/జన్నారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట అటవీ రెంజ్ పరిధిలోని పాత మామిడిపల్లి చెందిన శఫీయొద్దీన్ అనే యువకుడు బైక్‌పై అక్రమంగా తలిస్తున్న కలపను పట్టుకున్నట్లు అటవీ రెంజ్ అధికారిణి సుష్మారావు తెలిపారు. బుధవా రం రాత్రి ఎఫ్ఆర్‌వో సుష్మారావు, ఎఫ్‌బివోలు సాయి, రహీముద్దీన్, బేస్ క్యాంపు సిబ్బంది అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై కలపను తరలిస్తుండగా అర్జుగూడ వద్ద వెంబడించి నాలుగు కలప దుంగలను పట్టుకున్నారు. దీని విలువ సుమా రు రూ 11,133 ఉందని ఎఫ్ఆర్‌వో వెల్లడించారు. అదే సమయంలో నిందితులు తప్పించు కుని పారి పోయారు. అనుమానం వచ్చి గురువారం ఉదయం పాత మామిడిపల్లి గ్రామం లో నాగేంద్రవర్మ, సతీష్, సాయి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. దీంతో సాయి ఇంటి సమీపంలో ఎనిమిది టేకు కలప దుంగలు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ. 11వేలు ఉంటుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. అటవీప్రాంతంలో చెట్లను నరికిన, కలపను ఆక్రమంగా రవాణా చేసి నా, నిల్వ చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌వో హెచ్చరిం చారు. ఈ దాడిలో డీఆర్వో పోచమల్లు, ఎఫ్ఎస్‌వోలు నరేష్, శంకర్, నహీద, ఎఫ్‌బివోలు సాయి, రహీముద్దీన్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు. పట్టుబడిన కలప, బైక్, నిందితుడిని తాళ్లపేట అటవీ రెంజ్ కార్యలయానికి తరలించి విచారిస్తున్నామని ఆమె వెల్లడించారు. కలప అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువుల చోరీకు పాల్పడిన ఇద్దరి అరెస్టు

కోటపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన కొట్ట మల్లయ్య అనే రైతుకు చెందిన పశువును చోరీ చేసిన ఇద్దరిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. రైతులు కొట్ట మల్లయ్య తన పశువులు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రాజేందర్ సాంకేతికతను ఉపయోగించి పశువు దొంగలను గురు వారం పట్టుకున్నారు. మంథని గ్రామానికి చెందిన సమ్మయ్య , రవి అనే వ్యక్తులు పశువును దొంగలిం చినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పశు వులను అక్రమ రవాణా చేసినా, దొంగలించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కన్నాల బస్తీకి చెందిన సిలువేరు రవితేజ(29) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు రవితేజ వివాహం విషయంలో కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. పలు విషయాలపై మనస్తాపం చెంది గురువారం రేచిని రోడ్డు బెల్లంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రవితేజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. రవితేజ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకున్నారు.

నేడు సామూహికంగా వందేమాతరం ఆలాపన

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో సామూహిక అలాపన కార్యక్రమం నిర్వహించనున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంకించంద్ర చటర్జీ వందేమాతర గేయం రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూ హిక గీతాలాపన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

సిర్పూర్(టి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గురువారం సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలోని డౌనల్ ఏరియా, బెస్తవాడ, ఎస్సీ, కాలనీ, తదితర ఏరియాల్లో చేపడుతున్న ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు లబ్ధిదారులకు సూచనలు చేయాలన్నారు. ఆయన వెంట ఈవో తిరుపతి, ఏఈ సజియోద్దీన్ ఉన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలని మౌన దీక్ష



మౌన దీక్ష చేపడుతున్న బీసీ జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని జ్యోతి బాపూలే విగ్రహం వద్ద జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 43 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీసీ జేఏసీ నాయకులు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన రూపనార్ రమేశ్ మాట్లాడుతూ జనాభాలో 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయని అన్నారు. జనాభాలో సగభాగానికి పైన ఉన్న బీసీలు మాత్రం అగరవర్ణ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగాను, ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలి పోతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని లేకుంటే బీసీ ఉద్యమాన్ని పల్లె పల్లెకు విస్తరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ప్రణయ్, పురుషోత్తం, బాలేష్, జక్కన్న, విశాల్, రమేష్, శ్రీనివాస్, మిరాజ్, రవీందర్, నారాయణ, శంకర్, మారుతి, లవ్‌కుమార్, కిరణ్, నాందేవ్, సాయికృష్ణ, రవికాంత్, మధుకర్, సురేష్, కారు, నాను, నవీన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ స్కూళ్లను సమర్థవం తంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచర్లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 41 ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయని చెప్పారు. వీటిలో విధులు నిర్వహించేందుకు వచ్చిన దరఖాస్తులలో మెరిట్ ఆధారంగా పారదర్శకంగా టీచర్లను ఎంపిక చేశామని అన్నారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పాఠశాలలకు వచ్చే పిల్లలకు వచ్చే పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల కంటే మెరుగ్గా విద్య అందుతుందనే నమ్మకాన్ని టీచర్లు కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రీప్రైమరీ స్కూల్‌లో చేరే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు ఇతర పరికరాలను నెల రోజుల లోపు అందజేసేం దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 1000 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా వాటిని మన జిల్లాలో కూడా విస్తరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల ప్రాంతాల గిరిజనులకు సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొంది గ్రామంలో గురువారం నెస్టిల్ స్వచ్ఛంద సంస్థ వరద ప్రభావిత గ్రామాల్లో 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, నెస్టిల్ ఇండియా లిమిటెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వరద ప్రభావిత గ్రామాలలో నిరాశ్రయులకు 14 రకాల నిత్యావసర సరుకులు అందించారని అన్నారు. మారు మూల గిరిజన గ్రామాల్లో కూడా ముందుకు వచ్చి సరుకులు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అంతకు ముందు గ్రామస్థులు అధికారులకు గుస్సాడీ నృత్యంతో స్వాగతం పలికారు. కార్యక్ర మంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నెస్టిల్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గనిని సందర్శించి.. రికార్డులు పరిశీలించి..



లోగోను ఆవిష్కరిస్తున్న బృంద సభ్యులు

శ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే న్యూటెక్ గనిని 5 స్టార్ రేటింగ్ బృందం గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించింది. నాగ్‌పూర్ ప్రాంతీయ కార్యాలయం ఓఎస్‌డీ కోల్ కంట్రోల్ ఆఫీసర్ రాజేంద్ర చోలే, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల రక్షణ జీఎంలు రఘుకుమార్, మధుసూదన్, జెన్‌కో జీఎం మోహన్ రావు, వరంగల్ నిట్ ప్రొఫెసర్ శ్రీధర్, కొత్తగూడెం ప్రాంతీయ కార్యాలయం ఓఎస్‌డీ కోల్ కంట్రోల్ ఆఫీసర్ కృష్ణమోహన్ రావులను గని మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి జీఎం రాజేందర్‌తో కలిసి 5 స్టార్ చిహ్నాన్ని ప్రారంభించారు. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఆర్‌కే 5, 6 ఏజెంట్ శ్రీధర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, గని రక్షణాధికారి కొట్టె రమేష్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు

జైపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం నాగాల పేరుతో సర్క్యులర్‌కు విరుద్ధగా కార్మికులను కౌన్సెలింగ్ పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదని హెచ్ఎంఎస్ పిట్ కార్యదర్శి ఎర్రంశెట్టి సాయికుమార్ అన్నారు. ఇందారం గనులపై సంబంధిత పోస్టర్లను గురువారం విడుదల చేశారు. కుటుంబీకులతో హాజరు కావాలని వేధించడం సరైంది కాదన్నారు. వెంటనే ఈ విధానాన్ని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



కేకే 5 గని అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి మందమర్రి ఏరియాలోని అన్ని గనులు డిపార్టుమెంట్ల వద్ద గురువారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేకే ఓసీపీ, ఏరియా వర్కుషాపు, ఏరియా స్టోర్, కేకే 5 గని, సివిల్ డిపార్టుమెంట్, ఆర్కే1ఏ సీఎస్పీల వద్ద ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్ మాట్లాడుతూ ఉద్యోగులకు సొంతింటి కలను అమలు చేయాలని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విజిలెన్స్‌వద్ద ఉన్న 3,500 డిపెండెంట్ కేసులను పరిష్కరించాలని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నా స్పందించడం లేదన్నారు. 6 నుంచి 9 నెలలు అన్‌పిట్‌లో ఉన్న ఉద్యోగులకు ఫిట్‌ఫర్ సేమ్ జాబ్ ఇస్తున్న విధానం సరికాదన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గనుల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు కంది శ్రీనివాస్, సోంశెట్టి రాజేశం, ఎగ్గేటి రాజేశ్వర్, ముల్కల్లపల్లి వెంకటేశ్వర్లు, ప్రభాకర్, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరిం చాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలపై గురువారం ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేట 1, 2 గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ సింగరేణి స్ట్రక్చర్ సమావేశంలో పెట్టిన అంశాలను పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అనంతరం మేనేజర్లుసతీష్, లక్ష్మీనారాయణకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాసిపేట 1వ గని పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, 2వ గని పిట్ సెక్రటరీ శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు ఎస్ నాగేశ్వ ర్‌రావు, రాజేందర్,నరేష్, కొండపల్లినర్సయ్య, బొద్దున వెంకటేష్, కృష్ణచారి పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగగూడ ఓపెన్ కాస్టులో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గని మేనేజర్ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శేషశైనారావు, రాకేష్, కిరణ్‌బాబు, ఓదేలు, అంజన్న, అఫ్రిద్, సింహాద్రి, రాజ్‌కుమార్, తిరుపతి, షకీల్, నర్సింగం, రవి, రారాజు, వెంకటేష్, రఘుపతి, శ్రీనివాస్, గోపాల్, రమేష్, శంకర్, ఇషాద్, సంతోష్, మాయ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను కార్మికులు నమ్మొద్దు

శ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కంపల్సరీ రిటైర్‌మెంట్ స్కీం(సీఆర్ఎస్), ఏడా దికి 150 మస్టర్లను అమలు చేస్తారని కొన్ని యూనియన్లు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య కార్మికులను కోరారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఒక నెలలో 16 మస్టర్లు తప్పనిసరిగా ఉండాలని, లేనిపక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని యాజమాన్యం చెప్పడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాక ముందు సింగరేణిలో అన్నీ సక్రమంగా నడిచేవని, వారు వచ్చిన తరువాత 11 సంవత్సరాలు కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మార్చిలో స్ట్రక్చర్ మీటింగ్ తరువాత ఇంతవరకు ఎలాంటి సమావేశం నిర్వహించలేదని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, నాయకులు అడ్డూరి శ్రీనివాస్, అఫ్రోజ్‌ఖాన్, సురేష్, నారాయణ, వెంకటస్వామి, రాజేష్, వెంకటేష్, క్రాంతి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సమాచారం అందించాలి

శ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబాలకు చెందిన వారు జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్లు సమర్పించిన తరువాత వారికి సమాచారం అందించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉ ప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సేవా, మీ సేవా, బ్యాంకులు, సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాల ద్వారా పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లు పంపిస్తున్నారని తెలిపారు. కానీ ఈ విషయంలో ఏమాత్రం సమాచారం లేకుండా పెన్షన్ నిలిపివేడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యల దృష్ట్యా లైఫ్ సర్టిఫికెట్లు తమకు అందినట్లు ఎస్ఎంఎస్, మెయిల్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

శ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైఫై రిపేరర్ పేరుతో ఇంట్లోకి చొరబడి మహిళపై దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు శ్రీరాంపూర్ ఎస్‌ఐ ఎం. సంతోష్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మంథనికి చెందిన కుడుదుల వెంకటేష్ అనే వ్యక్తి వైఫై టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ నెల 1వ తేదీన శ్రీరాంపూర్‌లోని సీ టైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉండే లక్ష్మీ అనే మహిళ ఇంటిలోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇచ్చేందుకు ససేమిరా అనడంతో వైరుతో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు అరవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. గురువా రం అతడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

ఇండియన్ జర్నలిస్టు యూనియన్ కౌన్సిల్ సభ్యుడిగా వంశీకృష్ణ

మంచిర్యాల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఐజేయూ కౌన్సిల్ సభ్యుడిగా కేశెట్టి వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైనట్లు టీయూడబ్ల్యూజే, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీ కృష్ణను పలువురు అభినందించారు. మంచిర్యాల జిల్లా కోశాధికారిగా యూనియన్ నుంచి అక్రిడేషన్ కమిటీగా విజయవంతంగా పని చేసి సేవలందించి గుర్తింపు పొందిన ఆయనకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి, జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు డేగ సత్యనారాయణ, కార్యదర్శి సంపత్‌రెడ్డి, ఇతర నాయకులు ఆయనను అభినందించారు.

నేడు వందేమాతర గేయం గీతాలాపన

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వందేమాతర గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జన్నారం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్ 14లో సహస్ర, దివ్య, రిషిత, అండర్ -17 చందు, హర్షిత్, సాయికుమార్, అభిరామ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 4న ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. పీవీ శివకుమార్‌ను అభినందించారు.

ఉద్యోగ విద్య..

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



ఇండస్ట్రియల్ విజిట్ చేస్తున్న కోటపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కోటపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు రాక అనేక మంది కొంత కాలం పాటు వివిధ కోర్సుల్లో చేరి నైపుణ్యాలు పెంచుకుని అనంతరం ఉద్యోగ వేటలో పడుతున్నారు. దీంతో ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతుండగా ఓ వైపు చదువుతూనే మరో వైపు వృత్తి విద్యలో తర్ఫీదు పొంది నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల త్వరగా ఉపాధి అవకాశాలు వచ్చేందుకు వీలు కలుగుతుంది. ఈ నేపథ్యంలోనే పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెంచేందుకు ప్రభుత్వం వృత్తి విద్య (ఒకేషనల్ ట్రేడ్ కోర్సు)లను ప్రవేశ పెట్టింది.

జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలలతో పాటు విద్యార్థులు ఎక్కు వగా ఉండే పాఠశాలలను ఎంపిక చేసి వృత్తి విద్య కింద ఒక్కో పాఠశాలలో రెండు కోర్సులను అందిస్తున్నారు.

9 నుంచి ఇంటర్ విద్యార్థులకు

9,10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు ఈ కోర్సులు అందిస్తున్నారు. మొత్తం 12 ఏజెన్సీలు ఈ కోర్సుల నిర్వహణకు సహకరిస్తున్నాయి. వత్తి విద్యల్లో చేరిన విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్‌లతో పాటు ఇండస్ట్రియల్ విజిట్, మరో వైపు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ సైతం నిర్వహించారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా సమీపంలోని పరిశ్రమలు, ఆసుపత్రులు, దుకాణాల్లో క్షేత్రస్థాయిలో వివిధ అంశాలపై శిక్షణ అందించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, అగ్రికల్చర్, టూరిజం, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ, హెల్త్‌కేర్, ప్లంబింగ్, బ్యాంకింగ్ లాంటి తదితర కోర్సుల్లో విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఒకేషనల్ ట్రైనర్లు శిక్షణ కొనసాగిస్తున్నారు.

ఎంతో ఉపయోగం..

యాదయ్య, జిల్లా విద్యాధికారి

వృత్తి విద్య ట్రేడ్‌కోర్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా విద్యార్థులు చేరిన కోర్సుకు సంబంధించి పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో ప్రత్యేక తరగతులు, సాధనతో పాటు ఇంటర్న్‌షిప్‌తో క్షేత్రస్థాయిలో వివిధ అంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. దీని వల్ల భవిష్యత్‌లో విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపడడంతో పాటు ఉపాధి అవకాశాలు త్వరగా అందుతాయి. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి.

ఉద్యోగ మేళాలో విద్యార్థినికి అవకాశం

కోటపల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్‌తోపాటు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ వృత్తి విద్య పూర్తి చేసుకున్న విద్యార్థిని జరుపుల తేజశ్రీకి ఉద్యోగావకాశం లభించింది. రెండు రోజు ల క్రితం హైద్రాబాద్‌లో వృత్తి విద్య కోర్సులకు సంబం ధించి జాబ్‌మేళా నిర్వహించగా హాజరైన తేజశ్రీకి తమిళనాడులోని టాటా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇలా వృత్తి విద్యశిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంవత్సర కాలంలోనే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తోపాటు ఒకేషనల్ ట్రైనర్లు సంజీవ్, ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఈ పాఠశాలలో 9, 10, ఇంటర్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్‌పై వృత్తి విద్య శిక్షణలు కొనసాగుతున్నాయి.

రెండు స్థాయిల్లో కోర్సు

ఎంపిక చేసుకున్న కోర్సులు లెవల్ 1, 2 స్థాయిలో ఉంటాయి. ఏడాదికి ఒకసారి కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షలు జరుగుతాయి. ఇంటర్‌లో అదే ట్రేడ్ కోర్సు ఉంటే చేరవచ్చు. లేదంటే మరో కోర్సును ఎంచుకోవాలి. ప్రాక్టికల్స్, థియరీ విధానంలో పరీక్షలు ఉంటాయి. అధిక శాతం మంది విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, అగ్రి కల్చర్, ఫ్యాషన్ డిజైనింగ్, హెల్త్‌కేర్, బ్యూటీషియన్ కోర్సులు ఎంపిక చేసుకుంటున్నారు. దీని ద్వారా ఉపాధి అవకాశాలు త్వరగా అందనున్నాయి.



కంప్యూటర్ శిక్షణ నేర్చుకుంటున్న విద్యార్థులు, ఇంటర్న్‌షిప్‌కు హాజరైన విద్యార్థులు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం మండలంలోని అచ్చలాపూర్ గ్రామపంచాయతీలో పర్యటించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, పారిశుధ్య పనులను ప్రతి రోజు చేపట్టాలని, బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పేర్కొన్నారు. తడి చెత్తతో ఎరువులను తయారు చేయాలని, నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలన్నారు. అనంతరం శ్మశాన వాటిక పరిశీలించి పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో సతీష్ కుమార్, పంచాయతీ అధికారి అనిల్, కార్యదర్శి కల్పన, సిబ్బంది ఉన్నారు.

శాంతిఖనిని సందర్శించిన విద్యార్థులు


శాంతిఖనిని సందర్శించిన విద్యార్థులు

బెల్లంపల్లి,నవంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు గురువారం విద్యా పర్యటనలో భాగంగా శాంతిఖని గనిని సందర్శించారు. గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, సేఫ్టీ ఆఫీసర్ రాజు పర్యవేక్షణలో విద్యార్థులు బొగ్గుగనిని పరిశీలించి బొగ్గు తవ్వకాల ప్రక్రియ, యంత్రాల వినియోగం, భూగర్భగనుల నిర్మాణంతో పాటు పలు విషయాలను విద్యార్థులకు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు ప్రాముఖ్యత గురించి సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవికుమార్, ప్రిన్సిపాల్ రాజారమేశ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయండి


కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

మంచిర్యాల క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని ఉన్నత విద్యా సంస్థల యాజమాన్య సభ్యులు కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో అప్పులపాలయ్యామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేయాలన్నారు. స్కాలర్ షిప్‌లు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయుల జీతాలు ఇవ్వలేక, బిల్డింగ్ అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలో పాల్గొన్నామన్నారు. సమ్మెలో సభ్యులు నర్సయ్య, కరస్పాండెంట్ చంద్రమోహన్‌గౌడ్, రమణ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

వేమనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయిలోని కస్తూర్బా , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం సైబర్ మోసాలపై చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపరిచితులు ఫోన్‌లకు పంపించే లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ నెంబర్లు ఎవరికి చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు, బంధువులకు తెలియజేయాలన్నారు. ఎస్‌వో మయూరి, ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పేరు..ఇసుక జోరు


తహసీల్దార్ కార్యాలయం వద్ద గుమిగూడిన ట్రాక్టర్ల ఓనర్లు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

స్థానిక ట్రాక్టర్ ఓనర్లు టోకెన్లతో వస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. టోకెన్ల మాటున అక్రమ దందా నడుస్తుందని ఆరోపిస్తున్నారు. అడ్డుకుంటున్నప్పటికీ అక్రమార్కుల తీరు మారడం లేదు.

-పాత తేదీల్లో ట్రిప్పులు..

ప్రతి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు 25 క్యూబిక్ మీటర్ల ఇసుక నాలుగు విడతల్లో సరఫరా చేస్తారు. మొదట గృహాల లబ్ధిదారులు స్థానిక పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుంది. అర్జీలను కార్యదర్శి పరిశీలించి దరఖాస్తుదారులకు ధృవపత్రం జారీ చేస్తారు. వీటిని తీసుకెళ్లి తహసీల్ కార్యాలయంలో సమర్పిస్తే తహసీల్దారు కూపన్లు ఇస్తారు. ఏ వాగు నుంచి ఇసుక తరలించాలో కూపన్లో రాస్తారు. కూపన్ల ఆధారంగా లబ్ధిదారులు ఇసుక తెచ్చుకోవచ్చు. అధికార పార్టీ నాయకులు ఇళ్లు తామే మంజూరు చేయించామని, తామే ఇసుక ట్రిప్పులు కొడతామని చెప్పి ఆ కూపన్లను తీసుకొని వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. పాత తేదీల్లో ట్రిప్పులు కొట్టడం, ఒకటికి నాలుగు ట్రిప్పులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై నెన్నెల తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా టోకెన్ల దుర్వినియోగం జర గడం లేదన్నారు.

ఒక్కోసారి అనివార్య కారణాల వల్ల టోకెన్‌పై వేసిన తేదిన క్వారీకి వెళ్లలేని ట్రాక్టర్లు రెండు మూడు రోజుల తర్వాత వెళ్తున్నాయని చెప్పారు. క్వారీ వద్ద ఎస్‌ఆర్‌వో టోకెన్ ప్రకారమే అనుమతి ఇస్తారని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతిరోజు ట్రిప్పుల లెక్కలు ఇవ్వాలని ఆదేశించామని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని ఏకరూప దుస్తులు

కుట్టు మిషన్ కేంద్రాలకే పరిమితమైన బట్టలు


ధర్మారావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సాధారణ దుస్తుల్లో పిల్లలు (ఫైల్)

కాసిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఏడాదికి రెండు జతల యూనిఫాంలు అందజేయాలి. కానీ అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం కారణంగా నేటికి పిల్లలకు ఏకరూప దుస్తులు అందలేదు. విద్యా సంవత్సరం మొదలై 5 నెలలు గడుస్తున్నా చిన్నారులకు యూనిఫాంలు అందలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్‌లు పెంచేందుకు అధికారులు ఈ యేడాది జూన్‌నెలలో అమ్మ మాట అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలను తల్లిదండ్రులను ఆకర్షించి కేంద్రాల్లో హాజరు శాతం పెంచేందుకు అధికారులు చేసిన ప్రయత్నం సత్ఫలితాలను ఇచ్చింది. అధికారులు అడ్మిషన్‌ల కోసం తీసుకున్న శ్రద్ధ చిన్నారులకు కల్పించే సౌకర్యాలపై చూపకపోవడంతో మదర్స్ కమిటీ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి పిల్లలకు సకాలంలో యూనిఫాంలు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.దీనిపై జిల్లాసంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్‌ను వివరణ కోరగా ఏకరూప దుస్తులు అందుబాటులోకి వచ్చాయని, జిల్లా కేంద్రంలోని గోదాముల్లో నిల్వ చేశామన్నారు. వీటిని అతి త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటామనితెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కన్నెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకులపల్లి గ్రామపంచాయతీలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మందమర్రికి చెందిన వేద పండితులు గోవర్ధనగిరి అనంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. సుర్జాపూర్ గ్రామంలోని ఇందూరి లక్ష్మణ్ ఇంట్లో సోదాలు చేయగా మూడున్నర క్వింటాళ్ల బియ్యం దొరికిందన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి లక్ష్మణ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

జిల్లాకు ముగ్గురు ఎంపీవోల నియామకం

హాజీపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాకు ముగ్గురు నూతన మండల పంచాయతీ అధికారులు (ఎంపీవో) నియామ కం అయ్యారు. గ్రూప్- 2లో ఎంపీవోలుగా ఉద్యోగాలు సాధించిన వెంకటేష్, మహేష్, రమ్యశ్రీలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. గురువా రం మంచిర్యాల ఐడీఓసీలోని డీపీవో ఛాంబర్లో మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) డి.వెంకటేశ్వరరావును కలిసి వారి జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. డీపీవోతో పాటు జైపూర్ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, డీపీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రజ్ఞ, వెంకటేశ్, కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీవోలకు స్వాగతం పలికారు.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన గురిజాల సుమతి భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సుమతి బాల్య స్నేహితులు ఆసరగా నిలిచారు. సుమతి 2005 జీవీఎంఆర్ జడ్‌పీహైస్కూల్ పదో తరగతి చదువుకోవడంతో స్నేహిలంతా రూ. 40వేల ఆర్థిక సాయం కుటుంబానికి అందజేశారు. ఆపదలో ఉన్న వ్యక్తికి బాసటగా నిలువడం హర్షనీయమన్నారు.

మా సంక్షేమం గాలికేనా..?

●10 నెలలుగా అందని కాస్మోటిక్స్ ●దొనబండ సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఇక్కట్లు


హాస్టల్‌లో నేలపైనే విద్యార్థుల చదువు, నిద్ర

హాజీపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొనబండ సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

పది నెలలుగా విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్స్ చార్జీలు ఇప్పటికీ పత్తాలేవు. నిత్యం విద్యార్థులకు కావాల్సిన సబ్బులు, టూత్ పేస్ట్‌లకు ఇబ్బంది పడుతున్నా తమ సంక్షేమం ఎవరు పట్టించుకుంటా రంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాస్మోటిక్స్ ఛార్జీలు మరచిన ప్రభుత్వం..

దొనబండ హాస్టల్‌లో 68 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. కానీ ప్రస్తుతం 47 మంది ఉంటూ ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్నారు. గతంలో 30కి మించని విద్యార్థులు సంఖ్య ప్రస్తుతం గణనీయంగా పెరిగింది కానీ ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన కాస్మోటిక్స్ బిల్లులు గత 10 నెలలుగా నిలిపివేసింది. దీంతో విద్యార్థులు సబ్బులు, టూత్ పేస్ట్‌లు, బట్టలు ఉతుక్కునే సర్ఫ్ లాంటి వాటికి ఇబ్బందులు పడుతున్నారు. 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు నెలకు రూ.150 రూపాయలు,8 నుంచి 10 వరకు చదివే విద్యార్థులకు నెలకు రూ. 200 కాస్మోటిక్స్ ఛార్జీల కింద ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. వీటి ద్వారా విద్యార్థులు వారి అవసరాలకు తగ్గ సబ్బులు,టూత్ పేస్ట్, బ్రష్, బట్టల సర్ఫ్ లాంటివి కొనుక్కుంటారు. కానీ 10 నెలలుగా అందకపోవడంతో మా సంక్షేమం ఎవరు పట్టించుకోవాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూన్నారు.

పాములతో సావాసం చేస్తున్నాము....

వర్షం పడిన రోజు నిద్ర కరువే అంటున్నారు. పైకప్పు ఊరుస్తూ పెచ్చులుతుండడంతో నిద్రలు లేని రాత్రులు రాత్రులే అంటున్నారు. హాస్టల్ గ్రౌండ్‌లో నర్సరీ ఏర్పాటుతో ఆట స్థలం లేకపోవడమే కాకుండా, ఆ నర్సరీ నుంచి పాములు వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 68 మంది విద్యార్థులకు కేవలం 12 బెడ్లు మాత్రమే ఉండడంతో నేలపై నిద్రిస్తున్న సమయంలో పాములతో భయపడుతున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్న కానీ కాస్మోటిక్స్ ఛార్జీలు చెల్లించక పోవడం, హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన చెందుతున్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న తమకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

చార్జీలు విడుదల చేయాలి...

మిట్టపల్లి తిరుపతి, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



ధోనబండ ఎస్సీ హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులపై పలు మార్లు విద్యాశాఖ, కలెక్టర్‌కు విన్నవించాం. కానీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల భవిష్యత్ పట్టించుకోకుండా, బిల్లులు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. శిథిలావస్థ భవనాల్లో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

చేపల కోసం కాదు.. వాటి రక్షణకే వలలు


గూడెం శివారులో చేపల బావి చుట్టూ రక్షణగా ఉన్న వల

దండేపల్లి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ మీకు కనిపిస్తున్న వల చేపల కోసం వేశారని అనుకుంటే పొరపాటే.. సాధారణం గా చేపలు పట్టేందుకు వలలు ఉపయోగిస్తారు. కానీ మన కన్న ముందే అవి ఏ పక్షులకో.. ఆహారమైతే ఎలా.. దీని నుంచి తప్పించుకునేందుకు దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన ముంచు శ్రీనివాస్ అనే రైతు చిన్న ఉపాయాన్ని ఆలోచించి చేపలను రక్షించుకుంటున్నారు. తన పొలంలోని చేపల పెంపకం కోసం అర ఎకరంలో పెద్ద బావి తవ్వించి చేపలను పెంచుతున్నారు. కానీ గోదావరి నది సమీపంలో ఉండటంతో ప్రతి నిత్యం గోదావరికి వచ్చే వివిధ రకాల పక్షులు ఇక్కడికి వస్తుంటాయి.

దీంతో ఆ రైతు చేపలను రక్షించేందుకు బావి చుట్టూ మధ్య పెద్ద పెద్ద వలలను కొను గోలు చేసి దాని చుట్టు ఏర్పాటు చేశారు. దీంతో పక్షులు ఆదరికీ వచ్చిన వల ఉండడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నాయి మరి..

రాష్ట్రస్థాయి సైన్స్ మేళాకు విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయిమేళాకు ఎంపికైన ముత్యంపల్లి విద్యార్థులు

కాసిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైన్స్ మేళాకు కాసిపేట మండలం ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు గైడ్ టీచర్ బండ శాంకరి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన యువజనోత్సవాల్లో భాగంగా జిల్లా సైన్స్ మేళాలో ముత్యంపల్లి విద్యార్థులు విశ్వసూర్య 10వ తరగతి మొదటి స్థానంలో నిలువగా 9వ తరగతి విద్యార్థి హర్షిత్ రెండవ స్థానంలో, రాహుల్ మూడో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 10 నుంచి 25 వరకు హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ మేళాలో పాల్గొంటారని తెలి పారు. విద్యార్థులను డీవైఎస్‌వో హన్మంతరెడ్డి, ఈడీ దుర్గా ప్రసాద్, వయోజన విద్యా జిల్లా అధికారి పురుషోత్తంనాయక్, సైన్స్ ఆఫీసర్ రాజగోపాల్‌లు అభినందించారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయండి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెండు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గురువారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి బాపుయాదవ్, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వం సమాన పనికి సమానం వేతనం చెల్లించాలని, ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు కీర్తి, రజిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రమణారెడ్డి వర్ధంతి

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సింహ స్వప్నం దాసరి రమణారెడ్డి 31వ వర్ధంతిని తాండూర్‌లోని భగత్ సింగ్ భవన్‌లో సీపీఐ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కొండు బానేష్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగంలో చేరిన రమణారెడ్డి ఏఐటీయూసీ యూనియన్ నాయకునిగా కార్మికుల సమస్యల పరిష్కారం అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, నాగ రాజు, దుర్గయ్య, గోపాల్, కృష్ణ, సాయికుమార్, తిరుపతి, కళావతి, లక్ష్మణ్, చందు, సురేష్, రవి, లక్ష్మణ్, పోశం, అజయ్, అశోక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ పేరు.. ఇసుక జోరు..



- ఒక టోకెన్‌పై నాలుగేసి ట్రిప్పులు
- అధిక ధరలకు పట్టణాల్లో విక్రయాలు
- దొంగ ట్రిప్పులతో తగ్గిన ఆన్‌లైన్ బుకింగ్స్
- ప్రభుత్వ ఆదాయానికి గండి

నెన్నెల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతోంది. మండలంలోని ఖర్జీ క్వారీ నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను బెల్లంపల్లి, కాసిపేట, తాండూరు, దేవాపూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొందరు ఇందిరమ్మ గృహాల పేరిట ఇసుకను తోడేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఒక టోకెన్‌పై నాలుగేసి ట్రిప్పుల ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ విక్రయిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ ఇసుక బుకింగ్స్ తగ్గిపోయి, ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఆన్‌లైన్ బుకింగ్స్‌పైనే ఆధారపడే తమకు ట్రిప్పులు రావడం లేదని స్థానిక ట్రాక్టర్ల ఓనర్లు వాపోతున్నారు. వారానికి ఒక ఆన్‌లైన్ ట్రిప్పు కూడా రావడం లేదన్నారు.

నిర్మాణ పనులు జోరుగా నడస్తున్న ప్రస్తుత తరుణంలో ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్స్ కావ డం లేదంటే అక్రమ ఇసుక ఏ మేర రవాణా అవు తుందో అర్థం చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇళ్ల టోకెన్లతో తమకు అన్యాయం జరుగుతోందని స్థానిక ఓనర్లు నిరసనలకు దిగుతున్నారు. సోమవారం కూపన్లపై ట్రిప్పులు కొడుతున్న 30 ట్రాక్టర్లను అడ్డుకొని నెన్నెల పోలీసులకు అప్పగించారు. వారు గత నెల 31 నాటి టోకెన్లు చూపెట్టడం గమనార్హం. ఆ ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించారు. మంగళవారం వచ్చిన ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకొని వెనక్కి పంపించారు.



టోకెన్లతో వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకుంటున్న ట్రాక్టర్ల యజమానులు

అనుమతుల పేర అక్రమ దందా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంజూరైన గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించింది. ఒక్కో లబ్ధిదారుకు 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను నాలుగు విడతల్లో అందించేలా ప్రణాళికలు రూపొందించారు. కలెక్టర్ల ఆదేశాల మేరకు తహసీల్దార్లు కూపన్లు జారీ చేస్తారు. ఆ టోకెన్లను తీసుకెళ్లి ఇసుక తెచ్చుకోవచ్చు. కొంత మంది అక్రమార్కులకు ఇది వరంగా మారింది. లబ్ధిదారుల పేరిట కూపన్లు రాయించుకొని దర్జాగా ఇసుకను రవాణా చేస్తూ విక్రయించుకుంటున్నారు.

ఉదయం పది గంటల తర్వాతనే ట్రిప్పులు కొట్టాలనే నిబంధన ఉన్నప్పటికీ రేయింబవళ్లు ఇసుక బండ్లు నడుస్తున్నాయి. ఒక్కో టోకెన్‌పై నాలుగేసి ట్రిప్పులు చేరవేసుకున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. టోకెన్ల తతంగాన్ని గమనించిన..

మిగతా 7వ పేజీలో..

క్రీడల్లో గెలుపోటములు సహజం

మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

లక్షెట్టిపేట, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. గురువారం లక్షెట్టిపేట పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలిచినా ఓడినా సమానమే అన్నారు. ఓటమి అనేది విజయానికి నాంది అన్నారు. ప్రతీ ఒక్కరూ స్నేహ బావాలను అలవర్చుకుంటూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రతీ ఏటా ఇక్కడ క్రీడలను నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రీడలను అట్టహాసంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ రమకళ్యాణి, సీనియర్ అధ్యాపకుడు మహేశ్వర్‌రావుతోపాట క్రీడల ఇన్‌చార్జి మల్లిక, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాధరాణితోపాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, పీఈటీలు, క్రీడాకారులు, పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పులో అయ్యప్ప ఆలయాన్ని కూల్చొద్దు



మాట్లాడుతున్న అయ్యప్ప స్వామి భక్తులు

బెల్లంపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేపడుతున్న రోడ్డు వెడల్పులో భాగంగా అయ్యప్ప ఆలయాన్ని కూల్చొద్దని గురువారం అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని సంబంధిత అధికారులు కూల్చొద్దన్నారు. ప్రతి ఏటా వందలాది మంది భక్తులు అయ్యప్ప మాలధారణ తీసుకొని 41 రోజుల పాటు తమ దీక్షను దేవాలయంలోనే గడుపుతారు. అయ్యప్ప భక్తుల మనోభావాలను గౌరవించి రోడ్డు వెడల్పులో భాగంగా అయ్యప్ప దేవాలయానికి మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటిలో లేని విధంగా కేవలం బెల్లంపల్లిలోనే వందఫీట్ల రహదారి ఏర్పాటు సరైంది కాదన్నారు. అంతకుముందు అయ్యప్ప దేవాలయం నుంచి పెద్ద ఎత్తున స్వాములు మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు.

గిరిజన గ్రామాల్లో విద్యుత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యటన



గ్రామాలలో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

హాజీపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలంలోని గిరిజన గ్రామాలైన ర్యాలీ, నాగారం, గఢ్పూర్, చిన్నగోపాలపూర్లలో విద్యుత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రావు విస్తృతంగా పర్యటించి డీఏజేజీయూఏ పథకం కింద విద్యుత్ శాఖ చేపట్టిన పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. డైరెక్టర్ వెంట మంచిర్యాల జిల్లా విద్యుత్ ఆపరేషన్ ఎస్ఈ జాడె ఉత్తమ్, కన్స్ట్రక్షన్ డీఈ రాజన్న, ఏడీఈ వెంకటేశ్వర్లు ఉన్నారు. గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్రం ప్రారంభించిన ఈ పథకం ద్వారా గిరిజన గ్రామాలు సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధిస్తాయని తెలిపారు. ఈ పథకం కింద గిరిజన వినియోగదారులకు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా విద్యుత్ మీటర్ ఇస్తామని తెలిపారు. అలాగే ఇప్పటి ఈ గ్రామాల నుంచి 35 మందితో పాటు అంగన్వాడీ కేంద్ర ఉపాధ్యాయులు ఉచిత విద్యుత్ మీటర్లకు దరఖాస్తులు చేసుకున్నారని, విద్యుత్ సిబ్బంది కూడా లబ్దిదారులను గుర్తించి పథకం అర్హులందరికీ వర్తింజేసేలా చూస్తున్నారని తెలిపారు. రూరల్ ఏఈ మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కోటపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాఘవేందర్‌రావు అన్నారు. గురువారం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా విధులు నిర్వర్తించాలని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గూడెం ఆలయ హుండీ లెక్కింపు..



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

దండేపల్లి నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. భక్తులు కానుకలు, వివిధ పూజా టికెట్లు, ప్రసాదం అమ్మకాల సందర్భంగా దేవస్థానానికి రూ. 32,70,971 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. 42 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని స్వామి ప్రధానాలయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి రమేష్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై తాహసీనోద్దీన్, అర్చకులు సంపత్‌స్వామి, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు



విజేత జట్లకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

తాండూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్చలాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ 17 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు నిర్మల్, ఆదిలా బాద్, మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మొదటి స్థానంలో నిర్మల్ జట్టు, ద్వితీయ స్థానంలో ఆసిఫాబాద్ జట్టు, మూడవ స్థానంలో మంచిర్యాల జట్టు విజేతలుగా నిలిచాయి. ఎంపికైన ఈ జట్లు ఈ నెల 8 నుంచి 10 వరకు ఏడుల్ల బయ్యారంలో జరిగే అండర్ 17 రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన సృజన్‌కుమార్ గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ గోపాల్, రామ్మోహన్, పీడీలు, పీఈటీలు శ్రీనివాస్, రాజయ్య, రవీంద్ర, విజయ్‌చందర్, శారద, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తులపై ఐటీడీఏ చిన్నచూపు

జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు

నెన్నెల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలమైన తమ ఎరుకల కులస్తులను గిరిజన అభివృద్ధి సంస్థ పూర్తిగా పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం చిన్నచూపు చూస్తుందన్నారు. మండల కేంద్రంలో గురువారం జిల్లా సరసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తమ కులస్తులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని అన్నారు. పందుల పెంపకపై ఆధారపడి జీవించే తమకు ఎంపవర్మెంట్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పందుల పెంపకంతో పాటు తట్టలు, బుట్టలు, పొనకలు అల్లుకునే వారికి బ్యాంకుతో సంబంధం లేకుండా ఐటీడీఏ తరపున రూ. 10 లక్షలు రుణం ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామ శివారులో పందుల పెంపకం కోసం ఐదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో ఏకలవ్య ఆత్మగౌరవ భవనాలు, నాణ్యమైన విద్య కోసం ఏకలవ్య మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పోడు భూములకు పట్టాలు, వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం కులస్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లోకిని రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పోషం, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాము, నెన్నెల, బెల్లంపల్లి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, కన్నెపల్లి మండల అధ్యక్షులు మహేందర్, శ్రీరాముల రమేష్, సంతోష్, ఎల్లయ్య, కుర్ర రాజేష్, ముత్తేష్, దుర్గమ్మ, మదునక్క, సువర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు

సింగరేణి సంస్థకు ప్రభుత్వం చేయూత

త్వరలో 470 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

మందమర్రిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థకు తమ ప్రజా ప్రభుత్వం చేయూత నందిస్తుందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ తెలిపారు. సింగరేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘం విఫలమైందన్నారు. ఇటీవల మెడికల్ అన్‌ఫిట్ వారి పిల్లల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పడంతో ఈ నెల 12న కొత్తగూడెం వేదికగా 473 మందికి నియామక పత్రాలు అందిస్తానని ఉప ముఖ్యమంత్రి చెప్పారన్నారు. సింగరేణి కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం కృషి చేస్తుంది ఐఎన్‌టీయూసీ అని తెలిపారు.



మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇస్తున్న జనక్‌ప్రసాద్

పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు

మందమర్రిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగులపేట గ్రామంలో గురువారం పోచమ్మ తల్లికి గ్రామ ప్రజలు ఘనంగా బోనాలను సమర్పించారు. బోనాలను ఎత్తుకుని ఆలయం వరకు తరలి వెళ్లి బోనాలను సమర్పించారు. నాలుగు రోజులుగా ఆలయంలో విగ్రహ ప్రతిస్థాపన పూజలను ఘనంగా నిర్వహించగా గ్రామస్థులు గురువారం బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కడారి జీవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని పోచమ్మతల్లిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందీప్, రామ్మూర్తి, శ్రీనివాస్, మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకుడు శివ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విద్య..
వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు
సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు
7

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేటి ప్రపంచంలో పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, దీనిపై అందరు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మందమర్రి పోలీసుల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచితులు ఫోన్‌లకు పంపించే మెసేజ్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. పోలీసు శాఖ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తుందన్నారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీఈ నెంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1903కు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా లక్షెట్టిపేట ఎస్సై సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మన్‌రావు పోలీసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై ఉపేందర్‌రావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ వలలో పడవద్దని, ఏలాంటి సంఘటన ఏదురైనా వెంటనే 1930, 1905కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఫోన్‌ను అధికంగా వాడవద్దని సూచించారు. విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదల కలిగి ఉంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. పరీక్షల్లో త ప్పామని, ప్రేమ విఫలమైందనో ఆత్మహత్యలు చేసుకోవద్ద ని, కష్టపడి చదివితే జీవితంలో ఉన్నతంగా రాణించవచ్చ న్నారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదవుతాయన్నారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యా యుడు రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రిలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

శ్రీరాంపూర్ : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. సైబర్ జాకరుకా దివస్‌ను పురస్కరించుకొని గురువారం శ్రీ రాంపూర్ ఐటీఐ విద్యార్థులకు ఆన్‌లైన్ లోన్ యాప్స్, మోసాలు అనే విషయాలపై అవగాహన కల్పించారు. బిజినెస్ ఇన్‌వెస్ట్‌మెంట్ పేరుతో అనేక నేరాలు జరుగుతున్నాయన్నా రు. ఇలాంటి ఫిర్యాదుల్లో 26 శాతం సైబర్ నేరాలవేనన్నారు. ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు, వృద్ధులు సైబర్ మోసాలకు బలవుతున్నారని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

ఉపాధి కోల్పోయిన వారికి న్యాయం చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా ఉపాధి కోల్పోయిన వ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం సబ్‌కలెక్టర్ మనోజ్‌కు సీపీఐ నాయకులకు వినతి పత్రం అందజేశారు.

అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఎంతో మంది వీధివ్యాపారులు తమ దుకాణాలు కోల్పోయి జీవనోపాధికి ఇబ్బందిగా మారిందన్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారుతుందని పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయిన వారందరికీ త్వరితగతిన స్థలాలను ఏర్పాటు చేసి దుకాణ సముదాయాలను నిర్వహించుకునేలా చూడాలన్నారు. అలాగే పట్టణంలో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు రోడ్డుకు ఇరువైపుల పార్కింగ్ చేస్తున్నారని దీనితో పోలీసులు జరి మానాలు విధిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బెల్లంపల్లి వివిధ మండలాల నుంచి ప్రతి రోజు ఎంతో వాహనదారులు వస్తారని వెంటనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి తిలక్ అంబేద్కర్, ఏఐ వైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, రాజం, సోని పాల్గొన్నారు.